జనవరి - ఫిబ్రవరి, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక






# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసు నందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది. మన రక్షకుడు అయిన యేసుక్రీస్తు నామములో "స్పర్శ" పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. దేవుడు మనలను మరియొక సంవత్సరము ఆయన కృపలో నెమ్మదిగా, క్షేమముగా దాటించినందుకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసిన వారమై యున్నాము. గడిచిన సంవత్సరము నాతో కలిసి ఈ పరిచర్యలో పాలు పొందిన సహోదర, సహోదరీలకు ప్రత్యేకమైన వందనములు. ప్రభువు నందు మీ ప్రయాస వ్యర్థము కాదు అని విశ్వాసముతో ముందుకు వెళ్లవలెను. సమాజములో 2009వ సంవత్సరమంతయు ఎన్నో ఒడిదుడుకుల మధ్య ముగించబడడం ఎంతో శోచనీయమైన విషయం. గతించిన సంవత్సరములో ఆర్థిక మాంద్యము నుండి దేశము కోలుకోవడం సంతోషించదగిన విషయం. క్రిస్మస్ మరియు నూతన సంవత్సర ఆరాధనలో వచ్చిన ఆన్యజనులకు సువార్త ప్రకటించుటకు దేవుడు కృప చూపారు.

2010వ సంవత్సరములో నూతన తీర్మానములతో దేవుని ఉద్దేశ్యములను నెరవేర్చుట కొరకు బలపరిచి, అభిషేకించునట్లుగా ప్రార్థించెదము. దేవుని ప్రణాళిక సంవత్సరమంతా నెరవేరునట్లు బాధ్యతతో జీవించవలసిన అవసరం మన అందరి మీద ఉన్నది. మరియొక సంవత్సరం మినిస్ట్రీస్‌లో పరిచారకులైన నా తోటి సహోదర, సహోదరీలైన వారికి దేవుడు పరసంబంధమైన జ్ఞానము అనుగ్రహించునట్లుగా మీ ప్రార్థనల యందు జ్ఞాపకము చేసుకొనవలసినదిగా కోరుచున్నాను..

మిమ్ములను మీ కుటుంబములను దేవుడు 2010వ

మీ సహోదరుడు.....



జనవరి - ఫిబ్రవరి, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- (అ)భయం ........ 2
- గతమును మరచితివా? ........ 5
- ది ఏంజిల్ (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- బహుమానం(గిఫ్ట్) ........ 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 8వ భాగము ........ 11
- మాదిరి చూపుట (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 14
- ఇది తెలుసా? (ఉగాండా) ........ 16
- ఆత్మ ఫలము - 6వ భాగము ........ 17
- ఏబాలు మరియు గెరిజీము పర్వతము ........ 18
- బైబిల్ క్విజ్-8 ........ 19
- జన్మదిన శుభాకాంక్షలు ........ 20


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం,
హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420-2227



# (అ)భయం

- బ్రదర్ ఎపఫ్రా

"**భయము**" అనే మాటను సాధారణముగా మనము ఎప్పుడూ వింటూ ఉంటాము. చిన్నతనంలో అమ్మ "బూచి" అని భయపెడుతూ బిడ్డలకు ముద్దలు తినిపిస్తుంది. బిడ్డ భోజనం తృప్తిగా తినాలని చేసే ఈ ప్రయత్నం వలన చిన్ననాటి నుండే మనలో చాలా మందికి చీకటన్నా, పెద్దశబ్దం విన్నా, చివరికి కుక్కను చూసినా భయము. మనకి హాని, కీడు జరుగుతుందనే ప్రతికూల **(Negative)** ఆలోచనే భయమునకు పునాది.

భయమునకు అనేక కారణములు: అప్పు, వ్యాధి, పరువుపోతుందని, అవమానం జరుగుతుందని, భవిష్యత్తును గురించి, సంతానం లేదని, తనది వేరొకరు దొంగిలిస్తారని, మరణం ఎలా ఉంటుందోనని. ఈ భయములన్నిటికి కారణం అయిన వాటి నుండి విడిపించబడటానికి, నిర్భయంగా ఉండటానికి ఒకే ఒక ఆధారం ప్రభువైన క్రీస్తును విశ్వసించడం. పరిశుద్ధ గ్రంథములో అనేక సార్లు దేవుడు భయపడవద్దని సెలవిచ్చారు. అందుకే యెషయా 41:13లో ఏ పరిస్థితిలోనైననూ సహాయం చేస్తానని, నీ చెయ్యిపట్టుకొని నడిపిస్తానని అభయం ఇస్తున్నాడు ఆ దేవాది దేవుడు.

అసలు భయం అనేది లోకంలోకి ఎలా ప్రవేశించిందంటే, మొదటి మనుష్యులైన అవ్వ, ఆదాము దేవునికి వ్యతిరేకంగా ప్రవర్తించినపుడు వాళ్ళలో ఉన్న ధైర్యం పోయింది. భయముతో దాగుకున్నారు. ఆ లక్షణము మానవాళికి వారసత్వంగా వస్తోంది. క్రీస్తు పుట్టి సిలువలో తన ప్రాణాన్ని అర్పించడం ద్వారా మరణ భయాన్ని సంపూర్ణంగా జయించాడు. దాన్నే విశ్వసిస్తే మనము భయాన్ని ఏలుతాము లేకపోతే భయం మనల్ని ఏలుతుంది. విశ్వాసలేమి వలన మనము భయపడతాము. ఆశ్చర్యమేమిటంటే పాపం చేస్తే భయము వస్తుంది. భయంతో మళ్లీ పాపం చేస్తాం. ఆదాము విషయములో అదే జరిగింది. భయపడేవాడు మనము నిరీక్షిస్తున్న పరలోకములోకి వెళ్లలేడు (ప్రకటన 21:8).

చరిత్రలో ఇశ్రాయేలీయుల రాజు అయిన హిజ్కియా ఉన్నాడు. అతను దేవుడిని అనుసరించి భక్తి కలిగి నడుచుకుంటున్నాడు.ఆ రాజ్యంపైకి అష్షూరు ప్రాంత రాజు

యుద్ధానికి వచ్చాడు. అతను ఎటువంటి బలాఢ్యుడంటే ఎన్నో ప్రాంతములను జయించాడు (2 రాజు 18:32-36). మీ దేవుడు మిమ్మల్ని విడిపించడు అని భయమును కలిగించి, దేవుని యందలి విశ్వాసమును కూల్చి వేసే మాటలను పలుకుతూ ఇశ్రాయేలీయులకు పెద్ద సమస్యగా ఉన్నాడు. ఆ మాట విన్న ప్రజలు, రాజైన హిజ్కియా భయముతో దేవుని మందిరమునకు వెళ్ళారు. అష్షూరు రాజుకు కలిగిన సహాయము కంటే ఎక్కువైన సహాయం మనకు కలదు ధైర్యమును విడిచిపెట్టవద్దు (2 దినవృ 32:6,7) అని హిజ్కియా ప్రజలను ధైర్య పరిచాడు. వారు దేవుని యందు నమ్మిక యుంచారు. ఆ నమ్మకమును దేవుడు వమ్ము చేయలేదు. ఒక దూతను పంపి శత్రు రాజు సైన్యమును (లక్షా యెనుబది ఐదు వేల మందిని) సర్వనాశనం చేయించాడు. ఆ శత్రు రాజు పారిపోయి చివరికి తన కుమారుల చేతిలో చనిపోయాడు. ఈ దినములలో కూడా నీ సమస్య ఏదైనా, ఎంత పెద్దదిగా ఉన్నా దేవుని సహాయము వలన తప్పక బయటపడగలుగుతావు. చేయవలసింది ఒక్కటే అదేమనగా భయము కలిగిన సమయములలో ప్రభువైన యేసు నామములో ప్రార్థించడం, దేవుని ఆశ్రయించడం ద్వారా ఆయన ఇశ్రాయేలీయుల పక్షముగా యుద్ధము చేసినట్లు నీ పక్షముగా కూడా యుద్ధము చేస్తాడు, అప్పుడు నీ పరిస్థితి మారిపోతుంది.





ఒకసారి యేసు ప్రభువు శిష్యులతో కలిసి సముద్రములో ప్రయాణిస్తున్నాడు (మత్తయి 8:23). వారు ప్రయాణిస్తున్న దోనె అలల చేత కొట్టబడి ప్రమాదకర స్థితి లోనికి వెళ్ళింది. ఆ తుఫానును చూసిన శిష్యులు భయము చేత నశించిపోవుచున్నామని కేకలు వేసారు. అంతకు ముందు అనేక అద్భుతాలు చూసారు కానీ ఈ సమస్య వాటి కంటే క్రొత్తదిగా కనబడగానే భయపడ్డారు. దోనెలో ఉన్న యేసయ్యను శిష్యులు ఆశ్రయించగానే ఆయన తుఫానును గద్దించి దోనెను ప్రమాదం నుండి కాపాడారు.

సముద్రం అనేది లోకముగా భావిస్తే, ప్రయాణిస్తున్న దోనెను జీవితముగా అనుకుంటే, సముద్రము నెమ్మదిగా ఉన్నంతవరకూ దోనెకు భయము లేదు, దోనె ముందుకు వెళుతుంది. అలాగే జీవితములో సమస్యలు లేనంతవరకూ ధైర్యంగానే ఉంటాము. సముద్రములో తుఫాను రాగానే దోనె పరిస్థితి అగమ్యగోచరం. అలాగే లోకంలో వున్న మానవుని జీవితములో శ్రమలు ప్రారంభం అవ్వగానే భయం, ఆందోళన కలుగుతాయి. అప్పుడు మనకు జ్ఞాపకం రావలసినది తుఫానును అణచి, నెమ్మది కలిగించిన మన ప్రభువైన యేసుక్రీస్తు.

కాబట్టి ప్రియ చదువరీ ! వ్యాధి బాధలలో, కరువు ఇరుకులలో ఉన్నప్పటికి భయపడవలసిన అవసరం లేదు. కారణం సహాయం చేయగలవాడు, మన భయమును వెళ్ళగొట్టువాడు, చేయిపట్టుకొని మనకు అభయమిచ్చువాడు ఒక్కడే. ఆయనే మన ప్రభువును రక్షకుడు అయిన యేసు క్రీస్తు.


**దేవుడు మిమ్మును దీవించును గాక !**

# గతమును మరచితివా ?

ఒక యుక్త వయస్సు కలిగిన అమ్మాయి తనని తాను, చుట్టూ ఉన్న వారిని ద్వేషిస్తూ ఉండేది. కారణం ఆమె పుట్టుక నుండి అంధురాలు. ఒక వ్యక్తి మాత్రం ఆమెకి ఏ విధంగా సహాయపడగలను? అని ఆలోచిస్తూ, అనేక విషయాలలో సహాయపడుతూ ఉండేవాడు. అలా జరుగుచూ ఉండగా కొంత కాలమునకు అతడు ఆమెకు మంచి స్నేహితుడయ్యాడు. అతను ఆమె పట్ల కలిగియున్న బాధ్యతను గమనించిన ఆమె అతనిని ఎంతో ప్రేమించేది. నా కన్నులు వచ్చి లోకమును చూడగలిగితే నిన్ను వివాహం చేసుకుంటాను అని అతనితో చెబుతూ ఉండేది. ఒకరోజు ఆమెకు ఒకరు కన్నులు దానం చేయుట ద్వారా చూపును పొంది, అన్నిటిని చూడగలిగింది. అప్పుడు ఆ స్నేహితుడు నన్ను వివాహం చేసుకుంటావా? అని అడిగినప్పుడు ఆమె అతనిని తిరస్కరించింది. అతను కన్నీటితో అక్కడి నుండి వెళ్ళిపోయాడు. ఆమె అతనిని ఇష్టపడక పోవడానికి కారణం అతను గ్రుడ్డివాడు కావడం. కొన్నిదినములైన తరువాత ఆమెకు ఒక ఉత్తరం వచ్చింది. దానిలో “నా కళ్ళను జాగ్రత్తగా చూచుకో” ఇట్లు నీ నిజస్నేహితుడు అని ఉంది.



ప్రియమైన వారలారా! ఆ స్నేహితుడు స్నేహితురాలైన ఆమె చూపు పొందాలనే ఆశతో తన కళ్ళను దానం చేసి, లోకమును చూడగలిగేటట్లు చేశాడు. కానీ ఆమె గతమును మరిచిపోయి తన చూపునకు కారణమైన స్నేహితుణ్ణి తిరస్కరించడం మనకి అన్యాయమనిపిస్తుంది. అనేక సందర్భములలో మనము కూడా గతమును మరిచిపోయి ప్రవర్తిస్తున్న వారి వలె ఉన్నామా ?



# ది ఏంజిల్

- సిస్టర్ విజయ

ఒకానొక సమయములో తల్లి గర్భములో నుండి భూమి మీద పుట్టడానికి సిద్ధముగా ఉన్న చిన్న బిడ్డ దేవునితో ఈ విధంగా మాట్లాడసాగింది.

1. **చిన్నబిడ్డ** : నన్ను రేపు భూమి మీదికి పంపిస్తావని ఇక్కడి వారు చెబుతున్నారు. కానీ నేను చాలా చిన్నగా, నా పనులు నేను చేసుకోలేని స్థితిలో ఉన్నాను కదా, అక్కడ ఏ విధంగా ఉండగలను ?

**దేవుడు** : నేను అక్కడ చాలామంది దూతలను ఏర్పరిచాను, వారిలో ఒకరిని నీ కోసం సిద్ధపరిచాను. ఆమె నీ గురించి బాధ్యత తీసుకోవటానికి, నీ కోసం ఎదురు చూస్తూ ఉంటుంది.

2. **చిన్నబిడ్డ** : పరలోకంలో నవ్వుతూ పాటలు వింటూ, ఆనందించడం తప్ప నాకు ఏమీ తెలియదు కదా, నేను అక్కడ సంతోషముగా ఎలా ఉండగలను ?

**దేవుడు** : నీ కోసం సిద్ధపరిచిన దూత పాటలు పాడి నిన్ను సంతోషపరిచి, ఆమె ప్రేమ ద్వారా నిన్ను ఆనందింపచేయగలదు.

3. **చిన్నబిడ్డ** : అక్కడి ప్రజలు మాట్లాడే భాష నాకు తెలియదు కనుక వారు నాతో మాట్లాడటానికి ప్రయత్నించినప్పుడు నేను ఏ విధంగా వారిని అర్థము చేసుకోవాలి ?

**దేవుడు** : ఇది చాలా తేలికైన విషయము. నీ దూత నువ్వు ఎప్పుడూ వినని అందమైన, తియ్యని మాటలను ఎంతో ఓపికతో, సహనముతో ఏ విధంగా మాట్లాడాలో నీకు నేర్పిస్తుంది.

4. **చిన్నబిడ్డ** : దేవుని వైపు చూస్తూ, నాకు నీతో మాట్లాడాలి అనిపించినప్పుడు ఏమి చెయ్యాలి ? ఎలా మాట్లాడాలి ?

**దేవుడు** : ఆయన నవ్వుతూ, నీ దూత నాతో ఏ విధంగా మాట్లాడాలో ప్రార్థన ద్వారా నేర్పిస్తుంది అనగా ఏ విధంగా ప్రార్థించాలో బోధిస్తుంది.

5. **చిన్నబిడ్డ** : భూమి మీద చాలా చెడ్డ స్వభావము కలిగిన మనుష్యులుంటారు అని విన్నాను, వారి నుండి నన్ను ఎవరు రక్షిస్తారు ?

**దేవుడు** : ఆ దూత నిన్ను కాపాడి సంరక్షిస్తుంది. ఎలాంటి పరిస్థితులు కలిగిననూ నిన్ను విడిచిపెట్టదు.

6. **చిన్నబిడ్డ** : బాధగా దేవుని వైపు చూచుచు, నేను నిన్ను ఇంకెప్పుడూ చూడను కనుక చాలా బాధగా ఉంది

**దేవుడు** : నీ దూత నా గురించి నీకు ఎప్పుడూ బోధిస్తూ, వివరిస్తూ ఉంటుంది, అంతేకాక నేనెప్పుడూ నీ ప్రక్కనే ఉంటాను.

ఆ సమయములో ఎంతో ప్రశాంతంగా ఉన్న ఆ చిన్నబిడ్డకు భూమి మీద నుండి కేకలు వినిపించాయి. ఆ చిన్నబిడ్డ ఎంతో ఆత్రుతతో, మరియు మృదువుగా దేవా ! నేను నిన్ను విడిచి వెళ్ళిపోవుచున్నాను కనుక దయచేసి నా దూత పేరు ఏమిటో చెప్పమని అడుగగా దేవుడు నీ దూత పేరు అంత ముఖ్యము కాదు కానీ నీవు ఆమెను పిలిచే పిలుపు “అమ్మ”, “Mother” అని సమాధానమిచ్చారు.

పైన చెప్పబడిన విషయములను మనము పరిశీలించినట్లయితే దేవుడు పిల్లలకు అన్నింటిని నేర్పించే దూతగా తల్లిని ఉంచారు అని అర్థమవుతుంది. తల్లి గర్భములో పిండముగా రూపించబడక మునుపే ఆయన ప్రతి ఒక్కరిని ఎరిగిన దేవుడు. అందుకే పిల్లలకు తల్లిదండ్రులు మొదటి గురువులుగా, కుటుంబము మొదటి పాఠశాలగా అనేకులు చెబుతారు. మనము పిల్లల యొక్క బాధ్యతను అనగా వారికి అవసరమైనవన్నీ సమకూర్చే విషయములలో సోమరులుగా, బద్ధకస్తులుగా ఉండకూడదు. వారికి మంచి మాటలను నేర్పించి, తోటివారి యెడల సత్ప్రవర్తన గలవారై, సహాయం చేసే మనసు కృతజ్ఞత కలిగిన హృదయం కలుగునట్లుగా మంచి మాదిరి మనము కలిగి యుండాలి. ఎందుకనగా పిల్లలు కుటుంబములో తల్లిని అన్ని విషయాలలో గమనిస్తూ ఉంటారు. కనుక మనము ప్రవర్తనలో జాగ్రత్త కలిగిన వారిగా ఉండాలి.అదే విధముగా వారి అవసరతలన్నీ దేవునికి ప్రార్థించుట ద్వారా మాత్రమే తీర్చబడతాయని, మనము ఉన్న స్థితి  ఏ స్థితియైననూ అది దేవుని వలన మాత్రమే కలిగినదని తెలియపరిచే తల్లులుగా మనము ఉండాలి.  బైబిల్ గ్రంధములోని అపో.పౌలు 2 తిమోతికి వ్రాసిన పత్రికలో కపటం లేని నీ నమ్మకం నాకు జ్ఞాపకం ఉంది, ఆ నమ్మకం మొదట నీ అవ్వ లోయిస్‌లో, నీ తల్లి యునీస్‌లో ఉంది. అది నీలో కూడా ఉందని నా నిశ్చయత అని వ్రాస్తున్నాడు. తిమోతిలోని కపటము లేని నమ్మకత్వము మొదట అతని అమ్మమ్మ, తల్లిలో చూస్తున్నాను అని చెప్పబడుట ఎంత మంచి మాట. మనము కూడా కపటము లేని నమ్మకత్వము దేవుని యెడల, సంఘము యెడల, పొరుగువారి యెడల, అప్పగించిన పని యెడల కలిగి యుండుట ద్వారా మన పిల్లలు నమ్మకస్తులుగా తీర్చిదిద్దబడతారు.

ఒకవేళ వారు ఈ దినమున కపటముతో  ఉన్ననూ మన నమ్మకత్వమును కోల్పోక అందులో నిలిచి ఉండుట ద్వారా తప్పక వారిని జయించగలము.



మనము తీసుకునే నిర్ణయములు, తీర్మానములు వారి భవిష్యత్‌కి ఆశీర్వాదకరంగా, దేవునికి ప్రయోజనకరమైనవిగా ఉండాలి.

బైబిల్ గ్రంధములోని హన్నా అనే స్త్రీ పిల్లల కోసం దేవుని సన్నిధిలో ప్రార్థించుకున్న తరువాత ఆమె చేసుకున్న ప్రతిష్ఠను బట్టి పుట్టిన మగబిడ్డని తీసుకు వచ్చి దేవుని ఆలయము నందు విడిచి పెట్టింది.  దేవుని వాక్కు ప్రత్యక్షమగుట అరుదుగా ఉన్న ఆ దినములలో “యెహోవా వాక్కు

చేత నడిపించబడి, ఆ ప్రవక్త నోటి నుండి వచ్చిన ప్రతి మాట నెరవేర్చబడుతుంది" అని దాను మొదలుకొని బెయేర్షెబా వరకు పేరు సంపాదించిన సమూయేలు ప్రవక్తను ఇశ్రాయేలీయులలో నిలిపి ఉంచింది ఆ తల్లి యొక్క నిర్ణయం. ఇది పాత నిబంధనా కాలం. మరి క్రొత్త నిబంధనా సంఘంలో మన బిడ్డలను పెంచే విధానము, వారికి మాటలు నేర్పించి నడిపించే విధము, వారి యెడల మనము తీసుకునే నిర్ణయములు, నమ్మకమైన మన ప్రవర్తన ద్వారా వారి భవిష్యత్ ఆశీర్వదించబడుతుంది. చిన్ననాటి నుండి మన పిల్లలు ఆయన కృపలో పెరగాలని, రాబోయే దినములలో దేవుని వలన ఆశీర్వదించబడి, ఆయన నామమును మహిమపరిచేవారిగా ఉండాలనే ఆశ కలిగిన వారమైతే దేవుడు తప్పక తీరుస్తారు. నేను ఏ మార్గములలో నిలిచానో ఏ దేవుని వెంబడిస్తున్నానో, ఆ దేవుని వెంబడించేవారిగా, ఆ మార్గములలో నడిచేవారిగా నా పిల్లలు కూడా ఉండాలి అనే ఆ నిర్ణయం, వారిని తప్పక దేవుని మార్గములలో నిలిపి ఉంచుతుంది.

కాబట్టి ప్రియమైన వారలారా ! ప్రేమ, సహనము, ఓర్పులతో బిడ్డల యెడల బాధ్యత కలిగి మాటలు, క్రియలు, ప్రవర్తన విషయములలో జాగ్రత్త కలవారమై పెంచాలనే దేవుని ఉద్దేశ్యములకు అనుగుణంగా చిన్నబిడ్డలైన వారిని జాగ్రత్తగా పెంచేవారిగా, యౌవనస్థులైన బిడ్డల కొరకు ప్రార్థించి, దేవుని హస్తములకు అప్పగించేవారిగా ఉందాము ! అట్టి కృప దేవుడు మనకు దయచేయును గాక ! ఆమెన్ !


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

## 2010 జనవరి 26వ తేది ఉపవాస ప్రార్థన

**దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,**
**కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవునిని వేడుకుందాం.**

**సమయం:** ఉదయం గం. 9.00 లకు

**స్థలము:** బాలాజీ ఫంక్షన్ హాల్, N.H. 9, హయత్‌నగర్,హైదరాబాద్.

వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628

# బహుమానం (Gift)



చక్కగా చదువుకునే తన కుమారుణ్ణి చూసుకొని ధనవంతుడైన తండ్రి చాలా సంతోషించాడు. కాలేజీలో తన కుమారుడు వేదిక పైకి వెళ్ళి బంగారు పతకం తీసుకుంటూ వుంటే ఆ తండ్రి కళ్ళల్లో నుండి ఆనందభాష్పాలు వచ్చాయి. కాలేజీలో బహుమతి ప్రదానం అయిన తర్వాత తండ్రి కుమారులిద్దరు కలసి కారులో ఇంటికి వస్తుండగా ఆ కుమారుడు కారులో నుండి చూస్తున్నప్పుడు తనకు ఎంతో ఇష్టమైన (హీరోహోండా) బైక్ షోరూమ్ అద్దాల్లో నుండి మెరుస్తూ కన్పించింది. వెంటనే వాళ్ళ డాడీకి ఆ బైక్‌ను చూపుతూ డాడీ వచ్చేనెల నా పుట్టిన రోజు కదా నాకు ఆ కన్పిస్తున్న బైక్ బహుమానంగా ఇవ్వవా? అని అడిగాడు. రోజులు గడుస్తున్నాయి, పుట్టినరోజు దగ్గర పడుతోంది కానీ, తండ్రికి బైక్ కొనే ఆలోచన ఉన్నట్లుగా ఆ కుమారునికి కనిపించలేదు.

పుట్టినరోజు రానే వచ్చింది, తండ్రి తన కుమారుని పిలిచి, నువ్వంటే నాకు ప్రాణం కాబట్టి నీకు బహుమానం ఇస్తున్నానని చెబుతూ తన చేతిలో ప్యాక్ చేయబడి వున్న ఒక చిన్న పెట్టెను తన కుమారునికి ఇచ్చాడు. బైక్‌ను బహుమానంగా ఇస్తారని వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్న ఆ కుమారునికి తండ్రి రంగు కాగితాలలో చుట్టి ఇచ్చిన ఆ బహుమానాన్ని అయిష్టంతో తెరిచాడు. అందులో ఎంతో అందమైన "బైబిల్". దానిపై అతని పేరు గోల్డ్ అక్షరాలతో ముద్రించబడి వుంది. తాను కోరుకున్న బైక్‌ను కాకుండా "బైబిల్"ను కానుకగా ఇచ్చినందుకు తనలో వున్న ఉక్రోషాన్ని ఆపుకోలేక నువ్వు ఇంత ఆస్థిపరుడవై యుండి నేనడిగిన బైక్‌ను కాక "బైబిల్"ను ఇస్తావా? అని ఏడుస్తూ, అరుచుకుంటూ ఇంట్లో నుండి వెళ్తుండగా, బాబూ.... నా కుమారుడా! నా మాట విను, ప్లీజ్ వెళ్ళిపోవద్దు అని తండ్రి పిలుస్తున్నా ఆ కుమారుడు వినకుండా వెళ్ళిపోయాడు. కొన్ని దినములు అయిన తర్వాత తండ్రి ఆరోగ్యము క్షీణించింది. తన కుమారుని రాక కొరకు వెయ్యి కళ్ళతో ఎదురుచూసి దుఃఖముతో కన్ను మూసాడు. కొంతకాలమైన తర్వాత తన తండ్రి చనిపోయాడన్న వార్త విని, ఆస్తి అంతా తనకే చెందుతుందని తిరిగి ఇంటికి వచ్చాడు. ఇంటిలో అడుగు పెట్టగానే తన తండ్రి చూపిన ప్రేమ జ్ఞాపకం వచ్చి తనకు తెలియకుండానే కన్నీరు కార్చాడు. తన తండ్రి తన కొరకు ఇచ్చిన చిట్టచివరి బహుమానమైన బైబిల్‌ను చూడాలని ఆశతో తన గదిలోనికి వెళ్ళాడు.

బైబిల్ తెరిచినప్పుడు, అతని కంటికి "మీరు చెడ్డవారై యుండియు మీ పిల్లలకు మంచి యీవుల నియ్య నెరిగి యుండగా పరలోకమందున్న మీ తండ్రి తన్ను అడుగువారికి అంతకంటే ఎంతో నిశ్చయముగా మంచి యీవుల నిచ్చును" మత్తయి 7:11 అనే వచనము అండర్‌లైన్ చేయబడి వుండెను. అది ఆ కుమారుడు చదువుతుండగా బైక్ తాళపుచెవి ఆ బైబిల్ వెనుక కవరునుండి జారి క్రిందపడెను. ఆ కవరులో తన తండ్రి నాయనా ! నువ్వు ఆశించినట్లుగా ఆరోజు చూపించిన బైక్‌ను కొన్నాను. పూర్తిగా వెల చెల్లించాను. నువ్వు వెళ్ళి ఆ షోరూమ్ నుండి ఆ బైక్ తెచ్చుకో ఇట్లు నీ తండ్రి అని వ్రాయబడివుంది. దానిపై ఆరోజు తారీఖు కూడా వుంది. అది చదువుతూనే ఆ కుమారుడు కూలబడిపోయాడు. డాడీ ! డాడీ !! ఎంతగా నన్ను ప్రేమించావు డాడీ ! నీ ప్రేమను అపార్థం చేసుకొని తొందర పాటుతో నిన్ను విడిచి ఇంతకాలం తిరిగాను. తన తండ్రి చూపిన ప్రేమ జ్ఞాపకమునకు వచ్చి కన్నీరు విడిచాడు.

ప్రియ పాఠకా ! దేవుడు ఎంతో ప్రేమించాడు కాబట్టే నీవు కోరిన కోర్కెల కంటే, నీ ఆకాంక్షల కంటే విలువైన, ఘనమైన ఆయన కుమారుని ప్రాణాన్ని నీ కొరకు అర్పించాడు. కానీ ఉపమానంలో బైకి కావాలని తొందరపడిన ఆ యౌవనుడు చేసిన పొరపాటు నీ జీవితంలో చేయకు. బైకు కంటే విలువైన ఆ బైబిల్‌ను పొందినపుడే ఆ బైకు లభించినట్లుగా, విలువైన ఆ యేసుప్రాణ త్యాగాన్ని గ్రహించి నీ పాపాల విషయమై పశ్చాతాపపడినపుడు నీకు కావల్సినవన్నియు లభిస్తాయి. ఎవరైనా వస్తువులు బహుమానంగా ఇస్తారు కానీ ప్రాణమునే కానుకగా నీ కొరకు అర్పించిన ఆ దేవాది దేవుడు నీకు అవసరమయిన సమస్తమును ఎందుకు అనుగ్రహించడు ? ఇకనైనా నీ పాపనడతను విడిచిపెట్టు. నిన్ను ప్రేమిస్తున్న, నీ హృదయ ద్వారాల వద్ద నిలుచున్న యేసుపై నిర్లక్ష్యధోరణి విడనాడి, ఆ కృపామయుడు అనుగ్రహించబోతున్న బహుమానములను పొందుకో.

**ఎపఫ్రా మినిస్ట్రీస్ - 2010**

నూతన సంవత్సర కాలెండర్స్ కొరకు సంప్రదించండి.

బ్రదర్. **పి.రవీందర్,**

ఎపఫ్రా మినిస్ట్రీస్, హైదరాబాద్. సెల్: 99631 17628



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 8వ భాగము**

భారతదేశంలో మతం మార్చిన వారిని మూడు రకములుగా విభాగించవచ్చు. భౌతికంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా మారిన వారు. భౌతికంగా మార్పు చెందిన వారు కేవలం, పేరుకు క్రైస్తవులుగా మారతారు. తాము అంతకుముందు అనుసరించిన మతసంబంధమైన వాటన్నింటిని వదులుకొని క్రమంగా గుడికి వెళ్ళనారంభిస్తారు. కొండజాతి ప్రజలలోనూ, సామాజికంగా అట్టడుగున ఉన్న వారిలోనూ ఈ విధమైన భౌతికమైన మార్పుని గమనించవచ్చు.

రెండవ రకము వారైతే మనసుతో గ్రహించుకున్న వారై ఎంతో కొంత త్యాగం చేసి, యేసుక్రీస్తును అంగీకరించిన వారు. అయితే వీరు కూడా ఆర్థిక లాభములను దృష్టిలో ఉంచుకొని మతమును మార్చుకొనునట్లుగా ఆ తరువాత కాలంలో ఋజువైపోతుంది. సాధారణంగా ఈ రకంగా మార్పుచెందిన వారిలో చాలామంది ఎంతో విద్యావంతులైననూ యేసుక్రీస్తు శక్తిని ఏ మాత్రమూ ఎరుగని వారై ఉండినారు. పైకి భక్తిగల వారివలె ఉండియు దాని శక్తిని ఆశ్రయించని వారనియు, ఎల్లప్పుడూ నేర్చుకొనుచున్ననూ, సత్యమును గూర్చిన అనుభవజ్ఞానమును పొందని వారనియు 2 తిమోతి 3:5-7 వచనములలో పరి.పౌలు ప్రస్తావించినది ఇలాంటి వారిని గురించే. ఈ రకమైన భక్తి లేని క్రైస్తవ్యంలో పై వేషమే గాని, ఆత్మ శక్తి లేదు. సత్యమును నేర్చుకొనుచున్నట్లుగా కనబడతారు కానీ, తమ హృదయములలో ఆ సత్యమును ఎన్నడూ గ్రహించరు. భారత క్రైస్తవ సంఘ నాయకులలో చాలామంది తూర్పుదేశాల వారే కానీ పాశ్చాత్య దేశముల వారే కానీ, వీరందరూ ఈ కోవకే చెందినవారు. అందువలననే అనేకమంది వారి మతములలోని మానసిక శక్తికి, క్రైస్తవత్వానికి మధ్య తేడా చూడలేకపోవటానికి కారణం.

తార్సువాడైన సౌలు మారుమనసు పొందక పూర్వము కలిగియున్న "ధర్మశాస్త్రానుసారమైన నీతిని" మేధావులైన క్రైస్తవనాయకులెందరో కలిగియున్నారు. ఇలాంటివారు పైపై నీతిని మాత్రమే కలిగి ఉంటారు. ఈలాంటి నిర్జీవమైన భక్తి గలవారు కూడా చక్కని మర్యాదలును, మంచినిగ్రహము గలవారై దేవుని కొరకు కొంత ఆసక్తిని కలిగి ఉంటారు. అయితే మేకులతో గాయపడిన యేసుప్రభువు పాదముల యొద్ద లభించే విరిగిన మనస్సు నుండి, ఆయన సిలువ నుండి కలిగే భక్తి ఇలాంటిది కాదు. కేవలం మానసికంగా క్రైస్తవుడైన వానిలో పునరుత్థాన శక్తి పని చేయదు. ఆత్మానుసారము కాని క్రైస్తవ్యము అనుసరించు వారికి తమ హృదయములలో దేవుని నీతిని కలిగి ఉండే అనుభవముండదు.

మూడవదిగా దేవుని ఆత్మ వలన మార్పు పొందిన వారున్నారు. సుందర్‌సింగ్ ఈ కోవలోనివాడే. డబ్బు, హోదాలపై గల ఆశతో ప్రేరేపించబడిన వాడుకానందు వలన, మనుష్యుల వలన కలిగే ఘనతను వెదికిన వాడు కాకపోవడం వలననూ సుందర్‌సింగ్ క్రీస్తునందలి ఆత్మీయ జీవితమును కాపాడుకున్నాడు. మనుష్యులకును, వారి పొగడ్తలకును దూరంగా ఎవరికీ తెలియని మారుమూల ప్రాంతములలో తన ప్రభువుకు సేవ చేయాలనుకున్నాడు సుందర్. నవీన కాలపు అవిశ్వాసపు ధోరణుల వలన నిర్జీవ స్థితికి చేరిన సంఘమునకు నూతన జీవజలములు ఇవ్వడంలో ఇది ఎంతగానో తోడ్పడింది. క్రీస్తును పోలి జీవించిన ఈ ఒక్కని వలన ఎంతో మంది తమ విశ్వాసంలో నూతనపరచబడ్డారు.

భారత క్రైస్తవ సంఘంలో సుందర్ వలెనే మార్పు నొందిన ఎంతో మంది ఆరంభికులు, నాయకులు, హోదాలవైపు, ఘనతవైపు ఈడ్వబడిన వారై భేదాభిప్రాయములలోను, వివాదములలోను చిక్కుకొని లోతులేని వారైపోయారు. ఈరీతిగా దారి తప్పినవారు తమ జీవితములలో దేవునిపై గల పట్టును కోల్పోయారు. అయితే సుందర్‌సింగ్ ఇలాంటి దారి తప్పించే వాటికి, దృష్టిమరల్చేవాటికి దూరంగా ఉంటూ పౌలు, పేతురు ప్రకటించిన యేసుక్రీస్తును నమ్మకముగా ప్రజలకు చూపుచూ, అందరికి ఆమోదమైన క్రైస్తవునిగా జీవించాడు.

భారత క్రైస్తవులలో సంఘ నాయకత్వమును ఆశించే చాలామంది దేవుని మనసుననుసరించి,ఆయన వాక్యమును నేర్పెడి పరిశుద్ధాత్ముని దగ్గరకును, ఆయన వాక్యము యొద్దకును చేరి మోకాళ్ళ మీద నేర్చుకోవడానికి బదులుగా, పేరు, ప్రఖ్యాతులు, పదవులు పొందాలనే వాంఛలతో విదేశములలోని వేదాంత కళాశాలలను ఆశ్రయించడం ఎంతో దురదృష్టకరం. అభివృద్ధిలోనికి రావలసిన చాలామంది క్రైస్తవులు ఈరీతిగా లోకాశలకు బలైపోయి, సంఘమునకు ఆశీర్వాదంగా ఉండటానికి బదులుగా అడ్డుబండలుగా తయారయ్యారు. లోకాశలు, పేరు, ప్రఖ్యాతలపై వాంఛల వలన సుందర్‌సింగ్‌గారు ఎన్నడూ అంటుపడలేదు.

మిషనెరీగా ఉన్న వ్యక్తి రైలులో ప్రయాణం చేస్తున్న సుందర్‌సింగ్‌గారిని చూచి, ఆయన వద్దకు వచ్చి, సుందర్‌సింగ్ వారి క్రైస్తవ జీవితంలో సాధించిన వాటి కొరకై పొగడ్తలతో ముంచెత్తనారంభించాడు. సుందర్‌సింగ్ గారు వెంటనే తన రెండు చేతులను ఎత్తి చూపుచూ "అయ్యా, ఈ రెండు చేతులు బైబిలును కాల్చి వేశాయి, నేనో గొప్ప పాపిని" అని అన్నాడు. ఆయన ఈ మాటలు చెప్పిన తీరు ఇంకే మాత్రము ఆయనను పొగడకుండగ చేసి, ఆయనను రక్షించిన మహా గొప్ప రక్షకుడైన క్రీస్తుప్రభువు వైపు దృష్టిని మరల్చాయి.

తన ప్రసంగముల మధ్యలో ఆసక్తిని రేకెత్తించే తన వ్యక్తిగత అనుభవములను చెప్పినప్పటికిని అవన్నియు తన ప్రభువును, రక్షకుడైన క్రీస్తు కొరకు మరింత మహిమ కలగడానికి దోహదం చేశాయి.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)

# మాదిరి చూపుట



Hai Children! క్రిస్మస్ బాగా Celebrate చేసుకున్నారా? Happy New Year. 2009కి Good Bye చెప్పేసి, 2010కి Welcome చెబుతూ Wishes చెప్పుకున్నారా ? Happy Happy గా ఉన్నారు కదూ! ఈ New Year లో చాలా చాలా Plans వేసుకున్నారా? మీరు ఏ Plans వేసినా దేవుని సంతోషపెట్టేవిగా ఉండాలి సుమా! ఒక చర్చిలోని వారంతా దేవుని పని కొరకు ఏ విధంగా Plans వేస్తున్నారో చూద్దాము.

ఒక చర్చిలో పాష్టరుగారు, మరికొంతమంది విశ్వాసులు కలిసి ఒక ముఖ్యమైన విషయమును గూర్చి సమావేశమై, చర్చిస్తున్నారు. 2009 వరకూ సువార్త ప్రకటించబడని ప్రాంతములలో సువార్తను ప్రకటించాలని వారి సంకల్పము. అందుకు ఈ 2010లో ఏమి చేయాలి ? అని వారందరూ చర్చిస్తున్నారు.

వారిలో కొందరు టి.వి ద్వారా సువార్తను ప్రకటిస్తే అందరూ చూస్తారని, మరికొందరు రేడియో ద్వారా సువార్త బాగుంటుందని, ఇంకొందరు మాస పత్రికలలో ప్రకటిస్తే మంచిదని, ఈ విధంగా అందరూ రకరకాల అభిప్రాయాలను తెలియచేశారు. ఒక విశ్వాసి ఈ విధంగా తన అభిప్రాయం తెలిపింది. సువార్తను ప్రకటించాలంటే మీరు చెప్పిన ప్రచార సాధనముల కంటే కూడా ఒక క్రైస్తవ కుటుంబమును ఆ ప్రాంతమునకు పంపిస్తే, ఆ కుటుంబము యొక్క ప్రవర్తన యేసు ప్రభువు ప్రేమను చూపించేదిగా ఉంటుంది. కాబట్టి టి.వి కన్నా, రేడియో కన్నా, పుస్తకముల కన్నా వారి ప్రవర్తనే ఇతరులకు క్రీస్తును ప్రకటించేదిగా ఉంటుందని చెప్పింది. అందరూ ఈ ఆలోచన బాగుంటుందని మెచ్చుకున్నారు. ఆ విధంగానే సంఘములోని కొన్ని కుటుంబములను ఆయా ప్రాంతములకు పంపి, వారి జీవిత విధానము ద్వారా అనేకులకు సువార్తను ప్రకటించాలని వారందరూ నిర్ణయం తీసుకున్నారు.

చూశారా పిల్లలూ వాళ్ళ Plans ! చర్చిలోని వారందరూ సువార్త చెప్పటం వారి పని కాబట్టి వారు ఆ విధంగా Plans వేసుకున్నారు. మరి మీరు చదువుకోవటం మీ పని కాబట్టి ఏ విధంగా చదివితే మంచి మార్కులు వస్తాయో ఆ విధంగా Plan చేసుకోవాలి. స్కూల్‌లో ఏ రోజు చెప్పిన పాఠాలు ఆ రోజు చదువుకొని హోంవర్క్ రెగ్యులర్‌గా చేస్తే మీరు బాగా చదువుకోగలుగుతారు. అప్పుడు మీకు మంచి మార్క్స్ వస్తాయి. అందరూ మిమ్మల్ని మెచ్చుకుంటారు. అందర్నీ సంతోషపెట్టడం ద్వారా దేవుని మహిమపరచిన వారౌతారు.

పిల్లలూ ! తెలిసిందిగా దేవుని సువార్త ప్రకటించాలంటే ప్రచార సాధనముల కంటే మన ప్రవర్తనే శక్తివంతమైన సువార్త ప్రచార సాధనము. మరి ఈ New Yearలో మీరు మంచి మాదిరిగా ఉండాలంటే మీ ప్రవర్తన మారుమనస్సుకు తగినట్లుగా ఉండాలి. మేము చిన్నవారమని అనుకుంటున్నారేమో ! నేటి బాలలే రేపటి పౌరులు కదా ! చిన్నప్పటి నుంచే మీరు మంచి మాదిరిగా ఉండాలి. చాలామంది మారుమనస్సుకు తగిన ఫలములను ఫలించరు. క్రీస్తు మన హృదయములోనూ, మన జీవితములోనూ ప్రతిబింబించవలెను. అలా ఉంటారుగా ..

– మీ అక్కయ్య

# “నా జీవితములో దేవుని మేలులు”

- వెంకన్న బాబు, అగ్రహారం-కృష్ణాజిల్లా


ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు. నా పేరు వెంకన్నబాబు, మాది కృష్ణాజిల్లా, అగ్రహారం గ్రామం.


మాది హైందవ కుటుంబము. నేను 1985వ సంవత్సరములో ఐ.టి.ఐ చేసి ఉద్యోగ నిమిత్తము హైదరాబాద్‌కు వచ్చి ప్రైవేటు కంపెనీలో చిన్న ఉద్యోగములో చేరాను. 1992లో వివాహం జరిగింది. నాకు ఒక కుమార్తె అయితే చాలీ చాలని జీతముతో కాలమును వెళ్ళబుచ్చుతూ జీవితములో ఎంతో ఉన్నతమైన స్థితిలోనికి వెళ్ళాలని ఎన్నో విగ్రహములకు పూజలు చేస్తూ ఉండేవారము. ఎన్ని చేసిననూ మంచి స్థితిలోనికి వెళ్ళలేదు సరికదా కనీసము శాంతి, సమాధానం కూడా ఉండేది కాదు. యేసుక్రీస్తు కూడా ఒక దేవుడు, అందరూ సమానమే అని తలంచేవాడిని. అనుకోని విధంగా నా గొంతులో థైరాయిడ్ గడ్డ ఒకటి రావడం జరిగింది. మొదట్లో నేను అంతగా దానిని పట్టించకోలేదు. అయితే సంవత్సరములు జరుగుచుండగా ఆ గడ్డకు క్యాన్సర్ సోకింది. డాక్టర్లు పరీక్షించి రెండు రోజులలో ఆపరేషన్ చేసి తీసివేయాలని చెప్పినప్పుడు నాకు చాలా భయం కలిగింది. తరువాత ఆపరేషన్ చేసి తీసివేశారు. అయితే ఆరోజు నుండి నాకు శరీరంలో భయంకరమైన బలహీనత కలిగింది. చేతులు, కాళ్ళు, మూతి వంకర్లు పోవడం, నీరసంగా నడవలేని స్థితిలో ఉండేవాడిని. ఈ అనారోగ్య సమస్యలను బట్టి జీవితం మీద విరక్తి కలిగి ఇంటి నుండి దూరంగా పారిపోవాలని అనుకునే వాడిని. అదే సమయములో నా భార్య ప్రేరేపణతో ఇల్లు కట్టడానికి హౌసింగ్‌లోన్‌కి దరఖాస్తు చేశాము, కానీ మధ్యవర్తి ఒకరు లోన్ ఇప్పిస్తానని మోసం చేసాడు. ఇల్లు కట్టుకోవడం కూడా మధ్యలో ఆగిపోయింది. దానితో నేను ఇంకా మనస్తాపమునకు గురి అయ్యాను. కుటుంబములో నెమ్మది లేక ఎన్నో గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ సమయములోనే నా భార్య మా ప్రక్క ఇంటిలో ఉంటున్న ఒక సహోదరి ద్వారా అప్పుడప్పుడు చర్చికి వెళుతూ ఉండేది. నన్ను కూడా రమ్మని చెప్పేది కానీ నేను ఇష్టపడేవాడిని కాను అయినా ఒకటి, రెండుసార్లు వెళ్ళాను. అప్పుడు నాలో ఏదో తెలియని అనుభూతి, ఆనందం కలిగింది. మేము వెళ్ళినప్పుడెల్లా లోను గురించి ప్రార్థించమని, మా ఇల్లు కట్టబడాలని దైవసేవకులకు పదే పదే చెబుతూ ఉండేవారము. 2005వ సంవత్సరములో అనాజ్‌పూర్‌లో జరిగిన ఉపవాస ప్రార్థనకు మేము వెళ్ళాము. నాకున్న బలహీనతను బట్టి నేను రోజుకి 25 మాత్రలు వేసుకోవలసి వచ్చేది. అయితే ఉపవాసం ఉండగలనా? లేదా? అని ఎంతో భయపడ్డాను కానీ దేవుని మహా కృప వలన ఆ ప్రార్థనలో మంచి ఆరోగ్యము, నెమ్మది కలిగింది. అప్పటి నుండి మేము ప్రార్థనకి వస్తూ, మా అనుదిన

ప్రార్థనలలో ఆగిపోయిన ఇంటి గురించి ప్రార్థన చేసుకుంటూ ఉండేవారము. సేవకులు, సంఘము చేసిన ప్రార్థనలు ఆలకించిన దేవుడు కనికరించి, ఆయన కృప ద్వారా ఆగిపోయిన మా హౌసింగ్ లోన్ రావడానికి మరియు ఇల్లు పూర్తి చేసుకోవడానికి సహాయం చేసారు.

తరువాత మేము సజీవుడు నమ్మకస్తుడునైన యేసుప్రభువును విశ్వసించి, అదే సంవత్సరములో బాప్తీస్మము తీసుకొని అప్పటి నుండి దేవుని వెంబడిస్తూ ఉన్నాము. దేవుడు మాకు అనుగ్రహించిన సంఘమును బట్టి, సహోదర సహోదరీలు చూపుచున్న ప్రేమను బట్టి ఆయనను ఎంతగా స్తుతించిననూ ఋణస్తులమే. దైవసేవకులైన ఎపఫ్రాగారు దేవుని వాక్యములు బోధించుట మాత్రమే కాకుండా ఆ వాక్యానుసారముగా ఆయన జీవిస్తూ, నాకు ఒక మాదిరిగా ఉన్నారు. ఆయన బోధలు విన్న తరువాత ఇంకా దేవుని గురించి తెలుసుకొని, దేవుని కొరకు బ్రతకాలనే ఆశను కలిగించాయి.

నేను మొదట్లో అనారోగ్యముగా ఉన్నప్పుడు నా తల్లి, స్నేహితులు, బంధువులు చాలా బాధ పడేవారు. కానీ నేను దేవుని నమ్ముకొని స్వస్థపరచబడిన తరువాత నా ఆరోగ్యం చూసి వాళ్లందరూ ఆశ్చర్యపోయారు. నా తల్లి నా పట్ల దేవుడు చేయుచున్న మేలులు చూసి దేవుని యందు నమ్మకం కలిగి రక్షణ పొందింది. ఆ తరువాత మా కుటుంబములో దేవుడు చేసిన మేలులను బట్టి నా బావ, చెల్లి అలాగే నా కుమార్తె కూడా రక్షణ పొందియున్నారు. నేను నా కుటుంబము, జీవితకాలమంతా దేవునిలో నిలిచియుండాలని ప్రార్థించండి.






# ఇది తెలుసా?
## (ఉగాండా)

ఉగాండా ఆఫ్రికా ఖండములోని దేశము. ప్రపంచములోని పేద దేశములలో ఒకటిగా గుర్తించబడింది.

| | | |
|---|---|---|
| **రాజధాని** | : | కంపాలా |
| **జనాభా** | : | 32.7 మిలియన్లు |
| **ప్రెసిడెంట్** | : | యోవేరి ముసవేని |

**స్వాతంత్ర్యము :** బ్రిటీష్ ప్రభుత్వము నుండి అక్టోబర్ 9, 1962 సం॥లో స్వాతంత్ర్యం పొంది, రిపబ్లిక్ ఉగాండాగా పిలువబడుచున్నది.

1. ప్రజలలో ఎక్కువ శాతం దారిద్ర్యరేఖకు దిగువగా, దినసరి ఆదాయం 1 షిల్లింగ్‌తో జీవించుచున్నారు.
2. వ్యవసాయము మీద ఆధారపడి జీవించేవారి సంఖ్య ఎక్కువే అయినప్పటికి తినటానికి కూడా సరైన ఆహారం లేక జీవిస్తున్నవారు ఎక్కువ అందుకు కారణం ఆహార కొరత
3. హెచ్.ఐ.వి. ఇన్‌ఫెక్షన్స్ ద్వారా అనాధలైన పిల్లలు ప్రస్తుతం 2 మిలియన్లు ఉండగా 2010 నాటికి 3.5 మిలియన్లు పెరగవచ్చునని భావిస్తున్నారు. తల్లుల నుండి పిల్లలకు సంక్రమించిన వారు 20 వేల మంది ఉన్నట్లుగా అంచనా.
4. పెద్దలలోనూ, 5 సం॥ల లోపు పిల్లలలోనూ మలేరియా, డయేరియా, మరియు శ్వాస కోశ సంబంధమైన వ్యాధులతో బాధపడే వారి సంఖ్య కూడా ఎక్కువే. ఈ వ్యాధులకు సరైన వైద్యం చేయించుకోలేకపోవడానికి కారణం వారి పేదరికం.
5. ఇక్కడి మనుష్యులు సగటున జీవించు సంవత్సరములు

   పురుషులు 47 సం॥లు స్త్రీలు 50 సం॥లు
6. తక్కువమంది ప్రజలు మాత్రమే ఎలక్ట్రిసిటీని అనగా విద్యుత్‌ను ఉపయోగించేవారు. ఇక్కడి ప్రజలు ఆహారము, పరిశుభ్రమైన నీరు, మంచి ఆరోగ్యము, హెచ్.ఐ.వి నుండి రక్షణ, వ్యవసాయము, చదువు, కుటుంబముల భద్రత విషయములలో ప్రభుత్వము నుండి సహాయమును కోరుకుంటున్నారు.

ఉగాండా దేశము ఈ సమస్యల నుండి విడిపించబడి అభివృద్ధి చెందాలని ప్రార్థిద్దామా !






# ఆత్మ ఫలము - 6వ భాగము

- ఎడిటర్

**ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, విశ్వాసము, మంచితనము, సాత్వికము, ఆశానిగ్రహము.**

**ఆత్మ ఫలములో మూడవది సమాధానము**

**సమాధానం** అనగా స్వయం ఆధీనం చెడు ఆలోచనలను మన మనస్సుకు రాకుండా అదుపు చేసుకొనుట అని అర్థం. అనగా "నా సమాధానమును దొంగిలించనియ్యను" అని మనకు మనం నిర్ణయించుకొవడం ఎల్లప్పుడు శాంతి, సమాధానములలో ఉండుటకుగాను స్వయం ఆధీనం (మనల్ని మనం అదుపులో ఉంచుకోవడమే) పాటించడమే సరియైన పద్ధతి. మనము సమాధానమును కోల్పోయినప్పుడు భావోద్రేకములకు లోనవుతాము తద్వారా ఆలోచన లేని అనేక పనులు చేస్తూ అనవసరమైన మాటలు మాట్లాడుచూ, స్థోమత లేకపోయిననూ అవసరం లేని వస్తువులు కొంటూ, ఆకలి లేకపోయిననూ ఆహారము భుజిస్తూ, దుర్వ్యసనములకు బానిసలవుతూ ఉంటాము. వీటన్నిటి ద్వారా పిచ్చివారిగా ప్రవర్తిస్తున్నట్లు కనబడతాము. సమాధానం అనే ఆనందమును గురించి అపో. పౌలు ఇలా వ్రాసాడు. ఎల్లప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి ఫిలిప్పీ 4:4. పౌలు ఈ మాటలు చెరసాలలో నుండి వ్రాసాడనే సంగతిని మనము గ్రహించాలి. చింత పడుట, విచార పడుట వలన సమాధానమును కోల్పోతాము. దేనిని గూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయము నందు ప్రార్థనా విజ్ఞాపనముల ద్వారా మీ విన్నపములను దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును. "నా సమాధానమునే మీకు అనుగ్రహించుచున్నాను" అని ప్రభువు మనతో చెప్పారు. ఆయన అనుగ్రహించిన సమాధానము అనే ఆత్మఫలము ఫలించాలంటే ఇతరులు మన పట్ల చేసిన తప్పిదములను క్షమించుటకు సంసిద్ధత చూపాలి. ఎవరో ఒకరు మనలను బాధించినప్పుడు మన సమాధానమును కోల్పోవడం ఎంతో సులభం. అందుకే త్వరగా బాధపడుట గాని, మూతి ముడుచుకొనుటగాని చేయవద్దు. తోటివారితో సత్సంబంధములను కలిగి ఉండి, వారి పట్ల మంచితనమును కనుపరిచి, వారికి ఆశీర్వాదకారణముగా ఉండుట ద్వారా మనము పొందుకొనే సమాధానము ఎంతో విలువైనది.

- (ఇంకావుంది)



# ఏబాలు మరియు గెరిజీము కొండలు

ఇశ్రాయేలీయులలో అవిధేయులైన వారికి కలుగు శాపములు, విధేయులైన వారికి కలుగు దీవెనను ఈ కొండల మీదే ప్రకటించబడినట్లుగా బైబిలు గ్రంథం చెబుతుంది.


నేడు నేను మీ యెదుట దీవెనను శాపమును పెట్టుచున్నాను. నేడు నేను మీకాజ్ఞాపించు మీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను మీరు వినినయెడల దీవెనయు, మీరు మీ దేవుడైన యెహోవా ఆజ్ఞలను వినక నేడు నేను మీకాజ్ఞాపించు మార్గమును విడిచి మీరెరుగని యితర దేవతలను అనుసరించిన యెడల శాపమును మీకు కలుగును.

కాబట్టి నీవు స్వాధీనపరచుకొనబోవు దేశమున నీ దేవుడైన యెహోవా నిన్ను చేర్చిన తరువాత గెరిజీమను కొండమీద ఆ దీవెన వచనమును, ఏబాలుకొండమీద ఆ శాపవచనమును ప్రకటింపవలెను. ఏబాలు మరియు గెరిజీము కొండలు యొర్దాను అవతల సూర్యుడు అస్తమించు మార్గము వెనుక మోరే లోని సింధూర వృక్షములకు దాపున గిల్గాలునకు ఎదురుగా నున్న అరాబాలో నివసించు కనానీయుల దేశమందున్నవి.

యొర్దాను దాటిన తరువాత ఈ రాళ్ళను ఏబాలు కొండ మీద నిలువబెట్టి వాటి మీద సున్నము పూయవలెను. అక్కడ నీ దేవుడైన యెహోవాకు బలిపీఠమును కట్టవలెను. ఆ బలిపీఠమును రాళ్ళతో కట్టవలెను. వాటి మీద ఇనుప పనిముట్టు పడకూడదు. చక్కని రాళ్ళతో నీ దేవుడైన యెహోవాకు దహనబలులు అర్పింపవలెను. అక్కడ సమాధాన బలుల నర్పించి అక్కడ భోజనము చేసి దేవుడైన యెహోవా సన్నిధిని సంతోషింపవలెను, ఈ విధికి సంబంధించిన వాక్యములన్నిటిని ఆ రాళ్ళ మీద బహు విశదముగా వ్రాయవలెను.

ఆ దినమందే మోషే ప్రజలకు ఆజ్ఞాపించిన దేమనగా – మీరు యొర్దాను దాటిన తరువాత షిమ్యోను, లేవి, యూదా, ఇశ్శాఖారు, యోసేపు, బెన్యామీను గోత్రముల వారు ప్రజలను గూర్చి దీవెన వచనములను పలుకుటకై గెరిజీము కొండ మీద నిలువవలెను.

రూబేను, గాదు, ఆషేరు, జెబూలూను, దాను, నఫ్తాలి గోత్రముల వారు శాపవచనములను పలుకుటకై ఏబాలు కొండ మీద నిలువవలెను. అప్పుడు లేవీయులు యెహోవాకు విరోధముగా చేసిన వానికి కలుగు శాపములు, ఆయన ఆజ్ఞల ననుసరించు వానికి కలుగు దీవెనలు ఇశ్రాయేలీయులందరితోను యెలుగెత్తి చెప్పగా – ప్రజలందరూ ఆమెన్ అని అనవలెను. వారిలో సగము మంది గెరిజీము కొండ యెదుటను, సగము మంది ఏబాలు కొండ యెదుటను నిలువగా యెహోషువ ఆ ధర్మశాస్త్ర వాక్యములన్నిటిని అనగా దాని దీవెన వచనమును దాని శాపవచనమును చదివి వినిపించెను.




# బైబిల్ క్విజ్ -8

**పాత నిబంధనా గ్రంథంలో 6-10 పుస్తకములలో నుండి ఇవ్వబడినవి.**

1. మేలు చేసిన వానిపై విషపు చూపు నిలిపినవాడు ఎవరు?
2. వేగుచూచుటకు వచ్చిన వారిని దాచిన వేశ్య పేరేమిటి?
3. ఓబేదు ఎవరికి పుట్టెను?
4. నేను నిన్ను ప్రేమించుచున్నానని నీవెందుకు చెప్పుచున్నావు? ఈ మాటలు ఎవరు ఎవరితో అన్నారు?
5. నేను ఈ దేశమునకు న్యాయాధిపతినై యుండుట ఎంత మేలు అని ఎవరు ఎవరితో అన్నారు?
6. అతని పేరు అతని గుణములను సూచించుచున్నది అని ఎవరు ఎవరితో అనెను?
7. ఎవరి ప్రార్థన వలన సూర్యుడు నిలిచెను, చంద్రుడు ఆగెను?
8. ఒకడు తన చెప్పు తీసి పొరుగువాని కిచ్చుట అను మర్యాదను ఎవరు పాటించేవారు?
9. తండ్రి చేసిన ప్రమాణమును అంగీకరించిన కుమార్తె ఎవరు?
10. దావీదు కీర్తనే కానీ కీర్తనల గ్రంథం కాదు, దేవుడు తన శత్రువులందరి చేతిలోనుండి తప్పించిన దినమున చెప్పిన గీత వాక్యములు రిఫరెన్సు?

ఈ ప్రశ్నలకి సరైన సమాధానములు ఫిబ్రవరి 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు మార్చి పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా:- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

---

**<u>బైబిల్ క్విజ్ - 7 జవాబులు :</u>**

1. 70 (నిర్గమ 1:5) 2.హోరు (సంఖ్యా 33:38) 3.మేలిమి బంగారుతో (నిర్గమ 25:31) 4.గోషెను (ఆది 47:27) 5.10 (నిర్గమ 7-12 అధ్యాయాలు) 6.జ్ఞాన హృదయం గలవారు (నిర్గమ 35:26) 7. హెబ్రీ మంత్రసానులు (నిర్గమ 1:15) 8. లేవికా॥ 17:12 9. ద్వితీ॥కా 21:18 10.బాషానురాజైన ఓగును గూర్చి(సంఖ్యా 21:33,34))

**<u>బైబిల్‌క్విజ్-7 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపినవారి పేర్లు:</u>**

1.పి. మేరీ సాల్మన్ (ఇంజాపూర్) 2. పి.విజయకుమారి (భాగ్యలత) 3. కె.సాల్మన్ రాజ్ (భాగ్యలత)

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జనవరి - ఫిబ్రవరి

భాగ్యలత : చైత్రిక, హరికుమార్, సులోచనారాణి, రంగా, పి.మణి, రమాదేవి, కుమారి, క్రాంతికృష్ణ, పాల్‌ప్రవీణ్, దీవెన, నిర్మల, తిరుమల, హైమావతి, రాజ్‌కుమార్, సజీవ్, కృపాలత, సత్య, రాజేష్, రగూయేల్, మంజుల, జోసఫ్, పూజిత, తిమోతి, నిహారిక, తులసి, జ్యోత్స్న, జోసఫ్, కరుణాకర్‌రాజు, శ్రీనివాస్, సునీత, చల్లారావు, మనోహర్, దివ్య, రాజ్‌కుమార్, లత, స్నేహలత, ఆనందరావు, కె.కొర్నేలీ, మేరీ సౌజన్య

చింతల్ : కొర్నేలీ, ప్రకాష్, సజీవ్, శ్రావణి, సునీత, జయరాజు, రాహుల్, జ్యోతిర్మయి, పుష్పలత, జెర్రిరోజ్‌రాయి, ఉదయ్,పవన్‌చందు, జె.ఎస్.ఎన్.మూర్తి, రిబ్కా, దానియేల్, హెప్సిబా, అమర్, మహిమజ్యోతి,కీర్తన,స్పందన, నాగవెంకటలక్ష్మి, నాగరాజు, దుర్గా వెంకటలక్ష్మి,

అనాజ్‌పూర్ : విజయమ్మ, వైకుంఠరావు, హనోకు, అంకమ్మ, సువమ్మ, సునీత, కీర్తి,మారియ, అమర్‌నాథ్, జాన్‌బీ

ఇ.సి.ఐ.యల్ : జీవా, సజీవ్

# భక్త్‌సింగ్



పంజాబ్‌లో ఉన్న లాహోర్‌లో సిక్కు మతమును బహు నిష్ఠగా ఆచరించే కుటుంబములోని ఆరు మంది సంతానములో జ్యేష్ఠుడిగా 1903 జూన్ 6వ తేదీన భక్త్‌సింగ్ జన్మించెను. ఇంటర్మీడియట్ పాసైన సమయంలో చక్కటి బైబిల్ ఆయనకు బహుకరించబడగా తన మత గ్రంధాలే గొప్పవనుకొని, బైబిలు లోపలి కాగితాలు చింపివేసి, అట్ట బాగున్నందున దానిని దాచిపెట్టుకొనెను. 1926 సెప్టెంబర్‌లో ఇంజనీరింగ్ చదువుటకు లండన్ వెళ్ళెను. అయితే అక్కడ దుర్వ్యసనములకు లోనయ్యెను. నాస్తికుడిగా మారి సిక్కుమత నిష్ఠలను విడిచి వెంట్రుకలను కత్తిరించు కొనెను. వ్యసనములలో సంతోషమును పొందాలనుకొని, వాటిలో ఎటువంటి ఫలితము పొందక విరక్తిగా ఉన్న స్థితిలో కొందరు విద్యార్థులతో 1928 ఆగస్టులో సెలవు దినములకు కెనడా వెళ్ళెను. అక్కడ అనుకోని రీతిగా ఒక క్రైస్తవ ఆరాధనకు కేవలం భోజనం చేయాలనే ఆశతో వెళ్ళెను. ప్రసంగము జరుగుచున్నప్పుడు నిద్రబోయెను కానీ ముగింపులో ప్రార్థించుకుందాం, మోకరించండి అని ప్రసంగీకుడు అనగానే అప్రమత్తంగా మోకరించెను. అంతే పరిశుద్ధాత్ముడు అతనిని దర్శించగా, ఆ క్షణంలో క్రీస్తు నామమును ఉచ్ఛరించెను. ఆ కదలిక ఆయన రక్షణకు ప్రారంభమయ్యెను. 1929లో క్రొత్త నిబంధనను శ్రద్ధగా చదువుట ప్రారంభించిన తరువాత దేవుని స్వరము విని, పశ్చాత్తాపపడి, పాపినని ఒప్పుకొని, అలవాట్ల నుండి విడుదల పొంది, శుద్ధ హృదయమును పొంది, క్రమముగా పరిశుద్ధ గ్రంధమును పఠిస్తూ, ఆధ్యాత్మికాభివృద్ధి పొందుచుండెను. తరువాత కెనడాలోని వ్యాంకూవర్‌లో 1932 ఫిబ్రవరి 4వ తేదీన బహిరంగముగా క్రీస్తునంగీకరించి, బాప్తీస్మము తీసుకొనెను. ప్రభువు సన్నిధిలో ప్రార్థించి ఆయన చిత్తములో సేవ ప్రారంభించినప్పుడు "నీ అవసరతలను గూర్చి నాతో తప్ప ఎవరితోను చెప్పకు, నేను నిన్ను నడిపిస్తాను" అని వాగ్దానము ఇచ్చెను. ఆ ప్రకారమే భక్త్‌సింగ్ తన పరిచర్యను ప్రారంభించెను. పరిచర్య అంచెలంచెలుగా అభివృద్ధి పొందెను. ఇంచుమించు 60 సం॥లు ప్రపంచంలోని పలు ప్రాంతములలో సువార్తను ప్రకటిస్తూ ఉజ్జీవమును రగుల్కొల్పుటకు ప్రభువు ఆయనను వాడుకొనెను. ఇంగ్లీష్, ఉర్దూ, పంజాబీ, హిందీ భాషలలో దేవుని వాక్యమును ప్రసంగించగలిగిన ఈ దైవజనుల ద్వారా మన దేశంలో 6వేల సంఘములు స్థాపించబడినవి. "ఒక వ్యక్తి విస్తారమైన డబ్బును సంపాదించి చచ్చుట కంటె, ఆధ్యాత్మిక అవసరతలను తీర్చుట కొరకు ధారాళంగా డబ్బును ఖర్చుపెట్టుట గొప్ప భాగ్యము" అన్న ఈ దైవజనుడు తన 60సం॥ల పరిచర్య కాలములో కోట్లాది రూపాయలు నిస్వార్థంగా ప్రభువు సేవలో ఖర్చుపెట్టి ప్రభువిచ్చు మహిమా కిరీటాన్ని సంపాదించుకోవటానికి సిద్ధపడి, ప్రభువు పిలుపు నందుకొని తన 97వ యేట అనగా 17 సెప్టెంబర్, 2000 సంవత్సరమున ప్రభువు సన్నిధికి వెడలిపోయెను.

1. క్రిస్మస్ ఆరాధనను ప్రొజెక్టర్ స్క్రీన్ ద్వారా వీక్షిస్తున్న సహోదరులు.

2. వికలాంగుడైన సహోదరునితో కేకును కట్ చేయిస్తున్న బ్రదర్ ఎపఫ్రా గారు.

3. దేవుని మందిరములో వాక్యమును వింటున్న సహోదరీలు.











# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,

వనస్థలిపురం, హైదరాబాద్-500 070

Ph: 040-24202227  email: mail2church@gmail.com